"ఈనాటి ఈ సత్కారం వారికి మా గురుదక్షిణ!" అంటూ స్వాములవారు ముగ్గురి వంక వినయంగా చూసి, ఒక్క క్షణం నతమస్తకులయ్యారు. మరుక్షణం వారిని మనసారా దీవించారు.

సభ ముగిసింది. అందరూ తరలిపోయారు. ఆ ముగ్గురూ స్వాములవారి సమక్షంలో మిగిలారు.

స్వాములవారు చిరునవ్వుగా అడిగారు - "విషయం ఏమిటి?"

'విదురుడు' ముందుకు వచ్చాడు.

చిన్న మనవి అన్నాడు. తమకు ఇచ్చిన బహుమతులు ఆయన పాదాల చెంత ఉంచాడు.

"ఏమిటీ?"

"ఈ బహుమతులు, ఈ సన్మానాలు భక్తులమధ్య తరతమ భేదాలు సృష్టిస్తాయి. ద్వేషాన్ని, అసూయని పెంచుతున్నాయి. కొద్దిమందికి సంతృప్తి కలిగినా, అహంభావాన్ని సృష్టిస్తున్నాయి.చాలామందికి నిరాశ కలిగిస్తున్నాయి. శిష్యులలో సమదృష్టి పెంచండి. పరంమీదకు మసలుతున్న భక్తులను బహుమతులతో ఇహంమీదకు మరల్చడం జరుగుతోంది!" అని అంటూ నమస్కరించాడు.

స్వాములవారు చిరునవ్వుతో సమాధానం చెప్పారు "ప్రమాదో ధీమతామపి!"

# అమృత మథనం

నాలుగు దశాబ్దాలుగా అన్యోన్యంగా, మమేకంగా ఉన్న ఆ ఆదర్శదంపతులు - సోమయాజులుగారు, సోమిదేవమ్మగారు. వాక్కు... అర్థంలా, పార్వతీ పరమేశ్వరులుగా - ఆ వాడకే కాదు, ఆ పరగణాకే శిరోభూషణంగా ఉన్న ఆ ఆది దంపతులమధ్య ఈనాడు ఎందుకనో అగ్నిపర్వతం బద్దలై సంసారం షష్టాష్టకమైపోయింది.

"ఈ విషయం ఈనాడు తేలిపోవలసిందే!" అంటూ కట్టుకున్నవాడిని నిలవేసింది.

నిత్యం ముగ్ధమనోహరంగా. స్నిగ్ధ మధురంగా ఉండే ఆ సౌజన్య రాసి వంక కొంటెగా చూస్తూ "మహిషాసురమర్దనివి కావటానికి ఇవి శరత్ నవరాత్రులు కాదు, శ్రావణమాసం - సుమంగళులు సంతోషంగా ఉండేమాసం!" అని అంటూంటే -

"ఈ మాటలతోనే అందరినీ మోసం చేస్తున్నారు!" అని ఆవిడ కోపంగానే అంది.

ఆయన ముఖంలో క్షణకాలం కోపంతో కూడిన చిరాకు కనిపించింది. భ్రుకుటి ముడిపడింది. 'మామకూతురు! వాచాలత ఎవరికీ రాణించదు' అని అన్నారు.

ఆవిడ మాట్లాడలేదు.

'ఈ అకారణకోపానికి కారణం తెలుసుకోవచ్చా?"

"మీరే ఆలోచించుకోండి, మీకే తెలుస్తుంది నేనేమన్నా మాట్లాడితే వాచాలత

అంటారు!"

ఆయన దీర్ఘంగానే ఆలోచించారు. మీనమేషాలు లెక్క పెట్టారు. "నా కేమీ తెలియటంలేదు. పండక్కి వచ్చిన అల్లుడికి కారు కొనిపెట్టాను. మనవడిని ఇచ్చినందుకు కోడలికి కాసులపేరు చేయించాను. మీ గురువుగారు మన నగరం వచ్చినప్పుడు ఇంటికి ఆహ్వానించాను, పాదపూజ చేశాను. నాబతుకును పంచుకున్న ఇల్లాలికి ఆరు పదులు నిండిన శుభవేళలో అరవైనవర్సుల వడ్డాణం చేయించాను. నా వల్ల జరిగిన అపరాధమేమిటి?"

"నా కంటే మీరు ఎన్ని సంత్సరాలు పెద్ద"

"ఆరు సంవత్సరాలు."

"అంటే అరవై ఆరు సంవత్సరాలు వచ్చి...."

"వచ్చినా...?"

"మీకు పెద్దరికం రాలేదు. పెద్దమనిషి తరహా రాలేదు."

"నీ లభియోగం ఏమిటో నాకు అర్థం కావటంలేదు. వివరంగా చెప్పు!"

"మీ తీరు, మీ వైనం నాకు నచ్చుటంలేదు."

"ఎప్పటినుంచి?"

"ఈ మధ్యనే.... ఇన్ని సంవత్సరాలు మీతో కాపురం చేసినా, మీ నిజ స్వరూపం నాకు తెలియటంలేదు. మీరు అందరి భర్తలలాగా కాదు!"

"అని ప్రతి భార్యా అనుకుంటుంది."

"కాదు, మీ ప్రవర్తన నాకు అర్థంకావటంలేదు. అది సహజమో, నటనో నాకు తెలియటం లేదు."

"చెప్పు!"

"మీ దినచర్య నాకు బోధపడటంలేదు. ఉదయంలేవగానే రెండు గంటలు పెద్ద పూజ. ఆ విభూతి పట్టెలు, ఆ కుంకమ బొట్టు, మెడలో రుద్రాక్షమాలలు చూస్తుంటే సదాశివుడిలాగా కనిపిస్తారు.

"ఉషోదయంలో తూర్పు తెల్లవారుతూ ఉండగా మీ దగ్గర వేదఅధ్యయనం చేయడానికి వచ్చిన విద్యార్థుల మధ్య మిమ్మల్ని చూస్తూ ఉంటే వేదవ్యాసుడు గుర్తుకు వస్తారు."

"మీకోసం ఎదురు చూస్తున్నవారిని ఆదరించి వారి జాతకాలు పరిశీలించి, వారి జీవితాలలోని భూత భవిష్యత్ వర్తమాన కాలాలని గురించి వారికి మీరు విపులీకరిస్తూ, సాంత్వన సానుభూతి వాక్యాలతో సేదదీర్చి కొండంత ఆత్మ విశ్వాసం వాళ్లలో కలిగిస్తున్న మిమ్మల్ని చూస్తూ ఉంటే మీరు ఒకప్పుడు ఇంజనీరుగా పనిచేసేవారనే విషయమే మరిచిపోయి సాక్షాత్తూ ఆ వరాహమిహిరులే ఎదుట ఉన్నట్టు అనిపిస్తోంది.'

"ములగకొమ్మలు మహాపెళుసు, జాగ్రత్త!"

ఆవిడ ఈ మాట పట్టించుకోకుండా - "భోజనానంతరం భాగవతపఠనం, సాయంకాలం ఆలయంలో మీరు చేసే నిత్యప్రవచనం, సభలలో మీరు చేసే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు వింటూంటే నా మనసు ఆనందంతో గర్వంతో నిండిపోతోంది. నా అదృష్టాన్ని

తలుచుకుని నేనే మురిసిపోయేదాన్ని. కానీ....!

"కానీ... చెప్పు!"

"పగలు మీరు ప్రాతఃస్మరణీయులు, నిత్య పూజ్యులు. మీతో చిక్కల్లా చీకటి పడ్డ తరువాతనే!"

"చీకటి పడగానే మీ వైరాగ్యానికి వైరాగ్యం వస్తుంది. ఆ పట్టు పీతాంబరాలు లేవు. ఆ రుద్రాక్షలు లేవు. నుదుట ఆ రక్తసింధూరం లేదు. నైట్‌డ్రెస్, నోట్లో పైపూ, చేతిలో స్కాచ్‌విస్కీ ... వి.సి.ఆర్.లో ఇంగ్లీషు కాసెట్ చూసే మిమ్మల్ని చూసి - ఈ వయసులో ఈ అభావ చేష్టలు ఏమిటని" మీరు ఎప్పుడు మామూలు మనిషిగా మారతారా అని అనుక్షణం మధనపడుతున్నాను. వెయ్యి దేముళ్లకి మొక్కుకుంటున్నాను."

సోమయాజులుగారు ఓపికగా ఆవిడ చెప్పిందంతా విన్నారు. చిరునవ్వు నవ్వారు. కూనిరాగంగా -

"శివుడవో! మాధవుడవో! ఎవరని నిర్ణయించేదిరా?" అంటూంటే ఆవిడ మధ్యలో అందుకుని,

"శివుడూ, మాధవుడూ కాదు. మీరు ఆధ్యాత్మిక చింతనాపరులుగానో, లేదా స్కాచ్ విస్కీ తాగే సీమదొరగానో ఏదో ఒకటిగా ఉండండి. ఆ రెంటినీ కలిపి భ్రష్టుపట్టించకండి! నటనలో జీవించడం మంచిదే కావచ్చు. జీవితంలో నటిస్తే నట శేఖరులం, నటరత్నలం కాలేము. భ్రష్టులం అవుతాము!"

"భ్రష్టస్య కావా గతిః" అని గంభీరంగానే ప్రశ్నించారు.

"ఆత్మ వంచన!"

ఆయన లేచి వచ్చి ఆవిడ ఎదురుగుండా కూర్చుని, ఆవిడ కళ్లలోకి చూస్తూ నా కంట్లో నీకు ఏమి కనిపిస్తోంది వనజా?" అని అడిగారు.

కనులు కనులు కలిసి ఆ శుభవేళలో, ఆవిడ చిరునవ్వుగా అన్న మాట

"నేనే!"

"అమ్మయ్య!" అని ఆయన పెద్దపెట్టున నవ్వాడు.

"ఇది చాలా ఆనందకరమైన రోజు. నీ భర్త యోగక్షేమం గురించిన నీ తాపత్రయం నాకు అర్థమైయింది. దానికి నిన్ను అభినందిస్తున్నాను. కృతజ్ఞత తెలుపుకుంటున్నాను.'

"మీకుకోపం వచ్చింది!"

"లేదు. అంతరేక్షణ కలిగింది. జిజ్ఞాస ప్రారంభమైపోయింది. వెయ్యి ప్రశ్నలకు ఇది నాంది అయింది. అంగులో మెదటి ప్రశ్న - నేను ఎవరిని? నేను ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నాను. నేను దేనిని ఆశించి ఈ పనులు చేస్తున్నాను? ఇలా మనస్సంతా ప్రశ్నలతో నిండిపోయింది. నా బలహీనతలు నాకు తెలిసివచ్చాయి."

"మీరు బలహీనులు కారు, చాలా ధైర్యవంతులు! మీలో చాలా పట్టుదల ఉంది!'

"ఇప్పుడు తరచి చూస్తే, అసలు నిజం బయటకు వచ్చింది. నేనుచేస్తున్న ఈ పనులన్నీ పైకి ఎంతో ఉన్నతంగా కనిపించినా, నేనుచేస్తున్న పని చాలాస్వార్థంతో కూడినది. నేను ఇతరులకన్నా అధికుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, సాటిలేని వాడుగా నిలబడాలనే ఈ ఆకాంక్ష అన్ని రంగాలలో కూడా నేను ప్రథమస్థానములో ఉన్నానని అందరూ అనుకోవాలనే... అత్యాశ! సభ్యత, సంస్కారాల కింద దాగి, తరుణం వచ్చినప్పుడు తల పైకెత్తి చూసే ఈ కోరిక నన్ను క్షణం తీరిక లేనివాడుగా చేసినా, దీనికి మూలకారణం జ్ఞాన సముపార్జన, మోక్ష అన్వేషణ కాక చుట్టుపక్కలవారి పొగడ్తలకోసం, వారు ఇచ్చే బిరుదుల కోసం వెంపర్లాడి, బలహీనుడిగా మిగిలిపోయాను. అందరి మెప్పుకోసం అధాతో బ్రహ్మ జిజ్ఞాసా!'తత్వమసి!', 'ప్రజ్ఞానం బ్రహ్మ' 'సోహం' అంటూ చిలకపలుకులు పలుకుతూ ఉన్నా 'అహం' గానే మిగిలిపోయాను. హంసగా మారలేదు. కీటకం భ్రమరంగా మారలేదు. కీటకంగానే మిగిలింది. నేను పూర్ణమానవుడిని కాను. పురుషోత్తముడిని కాను. సగటు మనిషిని. అరిషడ్వర్గాలను గెలవని వాడిని. రోగాన్ని పోగొట్టు కోకుండా ఆరోగ్యాన్ని పెంచుకుందామని ప్రయత్నం చేస్తున్న వాడిని. గెలుపు సాధించలేక ఓటమిని అంగీకరించటం ఇష్టంలేని అహంభావిని. ఈ అవమానాన్ని మరిచిపోవడానికే ఈ స్కాచ్ విస్కీలు, ఈ టొబాకోపైపులు, ఈ ఇంగ్లీషు సినిమాలు, ఒక్కొక్కసారి ఈ సమస్యకు పరిష్కారం లేదేమోనని నిరాశ మిగులుతుంది. ఏం చెయ్యాలో తెలియటంలేదు.'

కొద్ది క్షణాలు ఆ ప్రాంతమంతా అంతులేని నిశ్శబ్దం ఆవరించింది.

"మీరు ఏమి చెయ్యాలో నేను చెప్పనా?" అని ఆవిడ అడిగింది.

"వింటున్నాను."

"ఎవ్వరి మెప్పుకోసమో జీవించడానికి ప్రయత్నం చేయకండి! మీరు మీరుగానే ఉండండి. మీరు మనసా,వాచా, కర్మణా సరాగులే, విరాగులు కాదు- మనం మామూలు మనుషులం. మన జీవితాలు ఇలా వెళ్లిపోతే చాలు!"

"మహా మనీషిలా, ఋషి లాగా కాదు, సగటు మనిషిలా, నలుగురి దృష్టిలో పడకుండా జీవించడం నేర్చుకోండి."

"మంచి గృహస్థుగా సమాజంలో మంచి వ్యక్తిగా మనుగడ సాగించండి. ముక్తికోసం కెంపరలాడితే అది దూరమవుతుంది. మన విధులను మనం సక్రమంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తే ముక్తి, మోక్షం కరతలామలకం అవుతాయి."

ఆశ్చర్యంగా, ఆనందంగా ఆవిడ వంక చూసి, ఆవిడ చేతిని తన చేతిలోకి తీసుకుని, "ప్రేమ దాతా! ముక్తిప్రదాతా! థాంక్యూ!" అని అన్నాడు.